# తీరు మారింది.. ప్రిపరేషన్ శైలి మారాలి..

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించడానికి దోహదం చేసే.. రెండు దశల్లో.. మొదటిదైన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ముగిసింది. లక్ష్యాన్ని ఛేదించాలంటే చివరి దశ..డీఎస్సీ ఎగ్జామ్‌లో విజయం సాధించాల్సిందే. మారిన షెడ్యూల్ నేపథ్యంలో డీఎస్సీ ప్రిపరేషన్‌కు దాదాపుగా 70 రోజులకు పైగా సమయం మిగిలి ఉంది. అందుబాటులో ఉన్న ఈ సమయంలో ప్రిపరేషన్ ఏ విధంగా సాగించాలి? ఎటువంటి వ్యూహాలు అమలు చేస్తే విజయ శిఖరాలను చేరుకోగలం? తదితర అంశాలపై విశ్లేషణ..

## 160 ప్రశ్నలు..150 నిమిషాలు:

నూతన విధానంలో టెట్‌కు వెయిటేజీ ప్రకారం 20 మార్కులు కేటాయిస్తుండడంతో..డీఎస్సీని 80 మార్కులకే పరిమితం చేశారు (గతంలో 100 మార్కులు ఉండేవి). మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కొక్క ప్రశ్నకు అర మార్కు కేటాయించారు. పరీక్ష సమయాన్ని కూడా రెండున్నర గంటలకు (150 నిమిషాలు) కుదించారు. అంతే స్థాయిలో సిలబస్‌లో మార్పులు చేశారు.

## మార్పులు.. చేర్పులు:

సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) రెండు విభాగాల్లోనూ సిలబస్ పరంగా చాలా మార్పులు చేశారు. కొత్తగా కొన్ని విభాగాలను ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని తొలగించారు. గతంలో ఎస్‌జీటీకి సంబంధించి జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, కంటెంట్-మెథడాలజీ (మ్యాథ్స్, సోషల్, సైన్స్), ఎడ్యుకేషనల్ సైకాలజీ అంశాల్లో ప్రశ్నలు ఉండేవి. నూతన విధానంలో సైకాలజీ స్థానంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఇంగ్లిష్‌తోపాటు తెలుగు భాషను కూడా చేర్చారు. ఎస్ఏలో కూడా..జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, కంటెంట్-మెథడ్, ఎడ్యుకేషనల్ సైకాలజీ అంశాలపై ప్రశ్నలు ఉండేవి. ప్రస్తుతం ఎడ్యుకేషన్ సైకాలజీ స్థానంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు.

## సిలబస్.. విస్తృతం:

నూతన విధానాన్ని పరిశీలిస్తే..కంటెంట్, మెథడాలజీకి ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. ఎస్‌జీటీ, ఎస్ఏ రెండు విభాగాల్లోనూ సిలబస్ పరిధి పెరిగింది. గతంలో ఎస్‌జీటీ కంటెంట్‌ను ఏడో తరగతి వరకే పరిమితం చేశారు. ప్రస్తు తం దీని పరిధిని ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు పెంచారు. అదేవిధంగా ఎస్ఏలో కూడా కంటెంట్ పరిధిని 6 నుంచి 10వ తరగతి వరకు అని పేర్కొన్నారు (గతంలో కంటెంట్‌లో 8,9,10 తరగతులాధారంగా ప్రశ్నలుండేవి).

**ప్రిపరేషన్:**

ఎస్‌జీటీ, ఎస్‌ఏ రెండు విభాగాలకు..కంటెంట్, టీచింగ్ మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, జీకే నుంచి, ఎస్‌జీటీకి అదనంగా లాంగ్వేజెస్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇందులో కంటెంట్, మెథడాలజీ సబ్జెక్టులను టెట్ కోసం చదివి ఉంటారు. కాబట్టి ఇది కొంత వరకు ప్రిపరేషన్‌లో కలిసివ స్తుంది. అయితే టెట్‌తో పోల్చితే, డీఎస్సీలో సిలబస్ విస్తృతం కాబట్టి ఎక్కువ శ్రమించాలి. ప్రిపరేషన్ శైలి మార్చాలి. అప్లికేషన్ మెథడ్‌లో ప్రిపరేషన్ సాగించాలి. మారిన సిలబస్ ప్రకారం ప్రశ్నల క్లిష్టత స్థాయి పెరిగింది. ఉదాహరణకు ఎస్‌జీటీ కంటెంట్‌ను 8వ తరగతికి పెంచి క్లిష్టత స్థాయిని పదో తరగతి (standard as well as linkages upto Class X level) వరకు అని ఇచ్చారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏదైనా ఒక అంశం ఎనిమిదో తరగతి వరకు ఉండి, 9, 10 తరగతి పుస్తకాల్లో పునరావృత మవుతుందో వాటి మీద అధిక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఎస్‌ఏలో కూడా కంటెంట్ పరిధిని 6 నుంచి 10వ తరగతి వరకు పెంచి ప్రశ్నల క్లిష్టత స్థాయి ఇంటర్మీడియెట్ (Subject concerned with difficulty standard as well as linkages upto Intermediate level) వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇక్కడ కూడా హైస్కూల్ స్థాయి వరకు ఉండి, 11, 12 తరగతి పుస్తకాల్లో పునరావృతమైతే వాటి మీద అధిక దృష్టి సారించాలి.

**లాంగ్వేజెస్:** కేవలం ఎస్‌జీటీ విభాగంలోనే లాంగ్వేజెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. గమనించాల్సిన అంశం.. ఇందులో చేర్చిన తెలుగు, ఇంగ్లిష్ భాషలో కంటెంట్ బేస్డ్ కావు. ఆయా భాషల్లో అభ్యర్థుల సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా (టెట్ మాదిరిగా) ప్రశ్నలు ఉండొచ్చు. తెలుగులో.. కవులు– రచయితలు –రచనలు, ప్రక్రియలు, భాషారూపాలు, భాషాంశాలు, సంబంధిత అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఇంగ్లిష్‌లో ఇంగ్లిష్–పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, సెంటెన్సెస్, ఆర్టికల్స్ అండ్ ప్రిపొజిషన్స్, డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్, స్పీచెస్, వాయిసెస్ వంటి అంశాలు ఉంటాయి. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలలో క్లిష్టత ఉంటుంది. టెట్‌లో లాంగ్వేజెస్ కోసం ఏ విధంగా ప్రిపేరేషన్ సాగించారో.. ఆ ప్రిపరేషన్ సరిపోతుంది.

**మెథడాలజీ:**

డీఎస్సీలో విజయాన్ని ఈ విభాగమే నిర్ణయిస్తుందని చెప్పొచ్చు. అభ్యర్థులు అత్యంత కష్టంగా భావించే విభాగం కూడా ఇదే. కారణం మెథడాలజీలో ప్రతి ప్రశ్నకు ఇచ్చే నాలుగు ఆప్షన్స్ ఒకే విధంగా ఉంటాయి. దాంతో అభ్యర్థులు ఈ విభాగంలో చాలా తప్పులు చేస్తుంటారు. ఇందులో ప్రశ్నలు విశ్లేషణాత్మకంగా, అనువర్తనాలతో కూడి ఉంటాయి. ఇందులోని కీలకాంశాలు.. బోధనా లక్ష్యాలు, అభ్యసనానుభవాలు, మూల్యాంకనం, బోధనా పద్ధతులు, బోధనోపకరణాలు. ఈ అంశాలను కంటెంట్‌లోని పాఠ్యాంశాలకు అన్వయించుకుని ప్రిపరేషన్ సాగించాలి. భావనలను తరగతి, ఉపాధ్యాయుడు, విద్యార్థికి అనుప్రయుక్తం చేసుకుని అధ్యయనం చేయాలి. బోధన పద్ధతుల విషయంలో కొంత అయోమయం ఉంటుంది. ఏయే సబ్జెక్ట్‌కు ఏ పద్ధతి సరిపోతుందనే అంశంపై అవగాహన పెంచుకోవాలి.

## పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్:

విద్యను చారిత్రక, తాత్విక, మనోవైజ్ఞానిక, సామాజిక, సమకాలీన దృక్పథంతో పరిశీలించడమే పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్. ఇందులో ఐదు యూనిట్లు ఉన్నాయి. ఇందులో విద్య చారిత్రక నేపథ్యం, ఉపాధ్యాయ సాధికారత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పర్యావరణ విద్య, జనాభా విద్య, సహిత విద్య, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, బాలల హక్కులు, మానవ హక్కులు, నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్-2005కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఎస్‌జీటీ/ఎస్ఏలకు ఒకే రకమైన సిలబస్ నిర్దేశించినప్పటికీ.. ప్రశ్నల క్లిష్టతలో తేడా ఉంటుంది. డీఈడీ అభ్యర్థులకు పేపర్-4 లో, బీఈడీలో కూడా ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాల్లో సంబంధిత అంశాల ప్రస్తావన కొంత వరకు ఉంటుంది. మిగిలిన సిలబస్ కోసం.. అంశాల వారీగా మార్కెట్లో లభించే స్టాండర్డ్ పుస్తకాల నుంచి నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి.

## జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:

గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే.. ఈ విభాగంలో విశ్వం, ఖండాలు, భారతదేశం-ఆంధ్రప్రదేశ్ భౌగోళిక, చారిత్రక, అర్థశాస్త్ర, పౌర సంబంధ, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలను వర్తమాన వ్యవహారాలతో మేళవించి ప్రశ్నలడుగుతున్నారు. కాబట్టి ఆ అంశాలకు సంబంధించిన కరెంట్ అఫైర్స్‌ను కూడా క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. వీటి కోసం.. పరీక్ష తేదీకి ఏడాదికి ముందు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చోటు చేసుకున్న పరిణామాలు, వార్తల్లోని వ్యక్తులు, జాతీయ-అంతర్జాతీయ సమావేశాలు, క్రీడలు-విజేతలు, తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. స్టాండర్డ్ జీకే కోసం.. చారిత్రక కట్టడాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, తెగలు-సంస్కృతులు, రాజధానులు, కరెన్సీ, దేశాల పార్లమెంట్‌ల పేర్లు, సముద్రాలు-నదులు, హై కోర్టు, సుప్రీం కోర్టు, చరిత్ర-స్వాతంత్ర్యోద్యమం, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

## టైమ్ ప్లానింగ్:

'ఆంధ్రా సివిల్స్'గా పేర్కొనే డీఎస్సీలో విపరీతమైన పోటీ నెలకొని ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 70 రోజులకు పైగా ఉన్న సమయాన్ని ప్రభావవంతంగా వినియోగించుకోవాలి. విభాగాల వారీగా సమయాన్ని విభజించుకోవాలి. ప్రతి రోజూ 10 గంటలు శ్రమించాలి. ఇందులో కంటెంట్, మెథడాలజీ విభాగాల కోసం 4 గంటల చొప్పున సమయం కేటాయించాలి. అదేవిధంగా పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్ కోసం 3 గంటల ప్రిపరేషన్ సాగించాలి. ప్రిపరేషన్‌లో ప్రతి అర గంటకు ఒకసారి విరామం ఇస్తూ చదవడం లాభిస్తుంది.

### వ్యూహంతోనే విజయం:

పాఠ్యాంశాల రూపకల్పనలో ఏకకేంద్ర విధానాన్ని పాటిస్తున్నారు. ఉదా: ఒక పాఠ్యాంశానికి సంబంధించి ప్రాథమిక భావనలను కింది తరగతుల్లో పొందుపరిచి.. ఎగువ తరగతులకు వెళ్లే కొద్దీ వాటి క్లిష్టత స్థాయిని పెంచుతూ పాఠ్యాంశాలను రూపొందిస్తున్నారు. కాబట్టి కంటెంట్ చదివేటప్పుడు కింది తరగతుల పుస్తకాలను చదవడం ప్రారంభిస్తే.. ఎగువ తరగతుల్లో పునరావృతమయ్యే అంశాలపై గట్టి పట్టు ఏర్పడుతుంది. ఇంపార్టెంట్ అంటూ కొన్ని పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా అన్ని పాఠ్యాంశాల మీద దృష్టి సారించాలి. చదివేటప్పుడు ఆయా అంశాల నుంచి ప్రశ్నార్హమైన వాటిని గుర్తించి వాటిని బిట్స్ రూపంలో నోట్స్ రాసుకోవడం మేలు. వివిధ మెటీరియల్స్‌పై ఆధారపడకుండా తెలుగు అకాడమీ పుస్తకాలకే పరిమితం కావాలి. పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాల చివరన ఇచ్చిన బిట్స్‌ను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. గత ప్రశ్నపత్రాలు, మోడల్ టెస్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి. దీని వల్ల ప్రశ్నల సరళి తెలుసుకోవడం తోపాటు ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకోవచ్చు. అధ్యాయాల వారీగా ప్రాక్టీస్ టెస్ట్‌లు రాయడం కూడా లాభిస్తుంది. సిలబస్ ప్రిపరేషన్ తర్వాత యూనిట్ వైజ్ రివిజన్‌కు ప్రాధాన్యతనివ్వాలి.

### నేపథ్యం ఏదైనా:

ఎస్‌జీటీ అభ్యర్థులు తమ నేపథ్యానికి చెందని పాఠ్యాంశాలు (ఉదాహరణకు.. బయాలజీ అభ్యర్థులు గణితం, సోషల్ స్టడీస్ చదవడం) చదివేటప్పుడు కొంత ఇబ్బందికి గురవుతారు. ప్రాథమికోన్నత తరగతుల పాఠ్యాంశాల విషయంలో సిలబస్‌ను అనుసరిస్తూ.. ప్రతి పాఠ్యాంశం వెనుక ఇచ్చిన బిట్స్‌ను ఔపోసన పడితే సులభంగానే ఈ సమస్యను అధిగమించొచ్చు. సోషల్, సైన్స్ అభ్యర్థులు మాత్రం గణితం విషయంలో కొంత జాగ్రత్తగా ఉండాలి. వీరు స్కూల్ ఎడ్యుకేషన్ తర్వాత ఎక్కువగా మ్యాథ్స్‌ను ఫాలో కాకపోవడమే దీనికి కారణం. దీనికి ఏకైక పరిష్కారం ప్రాక్టీస్‌కు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం. సూత్రాలు, మౌలికాంశాలపై దృష్టి సారించాలి. ఎస్‌ఏకు సంబంధించి మరిన్ని కోర్సులను అర్హతలుగా చేర్చడంతో.. విభిన్న నేపథ్యాలు ఉన్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. వీరందరు గమనించా ల్సిన అంశం.. ఫిజికల్, బయో సైన్స్ అభ్యర్థులు డిగ్రీలో చదివిన సబ్జెక్టులతో నిమిత్తం లేకుండా.. ఇంటర్‌లోని భౌతిక, రసాయన, బోటనీ, జువాలజీ, సోషల్ అభ్యర్థులు కూడా జాగ్రఫీ, చరిత్ర, అర్థశాస్త్రం, సివిక్స్‌లను చదవాల్సిందే.

## రిఫరెన్స్ బుక్స్

**ఎస్‌జీటీ:** 1-10వ తరగతి టెక్ట్స్ బుక్స్(తెలుగుతో సహా)

ఇంగ్లిష్ గ్రామర్ కోసం-రెన్ అండ్ మార్టిన్, మార్కెట్లో లభించే ఏదైనా స్టాండర్డ్ బుక్.

మెథడాలజీ కోసం-తెలుగు అకాడమీ పుస్తకాలు

**ఎస్ఏ:** 6–10వ తరగతి టెక్స్ట్ బుక్స్,
సంబంధిత సబ్జెక్టు కోసం– ఇంటర్మీడియెట్ తెలుగు అకాడమీ పుస్తకాలు
మెథడాలజీ కోసం–తెలుగు అకాడమీ పుస్తకాలు
**జీకే:** మనోరమ ఇయర్ బుక్, ప్రతిరోజు ఒక తెలుగు, ఇంగ్లిష్ దిన పత్రికను చదవాలి.

## ఎస్జీటీ పరీక్షా విధానం

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| జనరల్ నాలెడ్జ్ | 20 | 10 |
| పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ | 20 | 10 |
| లాంగ్వేజ్–1 (తెలుగు) | 18 | 9 |
| లాంగ్వేజ్–2 (ఇంగ్లిష్) | 18 | 9 |
| కంటెంట్ మ్యాథమెటిక్స్ | 18 | 9 |
| సైన్స్ | 18 | 9 |
| సోషల్ | 18 | 9 |
| టీచింగ్ మెథడాలజీ | 30 | 15 |
| మొత్తం | 160 | 80 |

SAKSHI

## ఎస్ఏ పరీక్షా విధానం

| సబ్జెక్ట్ | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| జనరల్ నాలెడ్జ్ | 20 | 10 |
| పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ | 20 | 10 |
| కంటెంట్(సంబంధిత సబ్జెక్ట్) | 88 | 44 |
| టీచింగ్ మెథడాలజీ | 32 | 16 |
| మొత్తం | 160 | 80 |

## షెడ్యూల్

| పోస్టు | పరీక్ష తేదీ |
|---|---|
| ఎస్‌జీటీ | 27.8.2012(ఉ) |
| స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజెస్) | 26.8.2012(ఉ) |
| స్కూల్ అసిస్టెంట్(నాన్‌లాంగ్వేజెస్) | 26.8.2012(మ) |
| లాంగ్వేజ్ పండిట్ | 27.8.2012(మ) |
| పీఈటీ | 27.8.2012(మ) |
| ఎస్‌ఏ, లాంగ్వేజ్ పండిట్ (స్పెషల్ స్కూల్స్) | 28.8.2012(ఉ) |
| స్కూల్ అసిస్టెంట్–నాన్‌లాంగ్వేజెస్ (స్పెషల్ స్కూల్స్) | 28.8.2012(మ) |

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం

**దరఖాస్తు** :ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

**ఫీజు చెల్లించడానికి చివరి తేదీ** :జూలై 12, 2012.

**దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ** :జూలై 13, 2012.

**వివరాలకు** :http://apdsc.cgg.gov.in

SAKSHI